
నాన్నంటే ఓ ఆసరా.. ఓ భరోసా..
నాన్నంటే ఓ బాధ్యత.. ఓ ధైర్యం.. నాన్నంటే ఓ స్ఫూర్తి.. ఓ ఆర్తి..

బరువెక్కుతున్న గుండె భారంగా మారుతున్నా.. కంటి నిండా నిద్ర కరువవుతున్నా.. కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకునే సూపర్ హీరో.. నవ మాసాలు మోసి అమ్మ జన్మనిస్తే.. బతుకంతా ధారపోసి జీవితాన్నిచ్చేది నాన్న. స్వార్థం లేని ప్రేమతో గుండెలపై ఆడిస్తాడు. బుడిబుడి అడుగుల నుంచి ప్రతి చోట వెన్నంటి ఉంటాడు. కష్టాల్లో నిర్భరంగా.. ఆపదలో ధైర్యంగా నిలబడేలా భరోసానిస్తాడు. విజయంలో మెట్టుగా మారుతాడు. ఒక్క మాటలో చెప్పాలంటే కష్టాన్ని కళ్లలో దాచి.. సంతోషాన్ని చేతినిండా పంచి.. తన కోసం ఏదీ దాచుకోకుండా.. కన్న బిడ్డలే సర్వస్వంగా బతుకుతాడు. అందుకే నాన్నంటే ప్రతి కుమారుడు, కుమార్తెకు కొండంత ధైర్యం. తండ్రి చేయి పట్టుకొని ఉన్నత గమ్యం వైపు నడిచిన వారు ఎందరో ఉన్నారు. ఆదివారం ప్రపంచ తండ్రుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు..

- సాక్షి నాగర్‌కర్నూల్/ వనపర్తి/ జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)



రియల్ హీరో..

'మా నాన్న రఘునాథ్ గైక్వాడ్ చిన్నప్పటి నుంచి చాలా కష్టపడి మమ్మల్ని చదివించారు. కిరాణ షాపు నిర్వహిస్తూ మా చదువుల కోసం ప్రోత్సహించారు. ఆయన నుంచి కష్టపడే తత్వం, ఇతరులకు సాయం చేసే గుణాన్ని అలవర్చుకున్నా. ప్రతి ఒక్కరికీ నాన్నే రియల్ హీరోగా ఉంటారు.

- నాన్న రఘునాథ్ గైక్వాడ్‌తో నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్



నాన్నే.. సూపర్ హీరో

- జీవిత పాఠాల్లో తండ్రికి మించిన గురువు లేరు
- పిల్లల ప్రతి అడుగులో వెన్నంటి ఉంటూ భరోసా
- భవితకు మార్గదర్శిగా ఉంటూ..

వారి ఎదుగుదలకు అహర్నిశలు కష్టపడే శ్రమజీవి

ప్రాణానికి రూపమిచ్చేది నాన్న




అమ్మ ప్రాణం పోసి జీవమిస్తే.. ఆ ప్రాణానికి ఓ రూపం ఇచ్చే వ్యక్తి నాన్న. ప్రతి విజయంలో వెనుక ఉంటూ బాధలోనూ నేనున్నానని ఆసరా ఇచ్చే వ్యక్తి. గెలిచినప్పుడు ఆనందంగా పది మందికి చెప్పుకొని ఓడినప్పుడు మన భుజం తట్టి గెలుస్తావులే అని ధైర్యం చెప్పేది నాన్న ఒక్కడే. అది మా నాన్నలో చూశాను. సూర్యుడు తన కిరణాలతో లోకమంతటికీ వెలుగును ఎలా ప్రసరిస్తాడో.. మన జీవితాల్లో తండ్రి కూడా అలాంటి వెలుగులే పంచేందుకు నిరంతరం శ్రమిస్తారు. జిల్లాలోని ప్రతి నాన్నకు ఫాదర్స్ డే శుభాకాంక్షలు. ఈ ఫాదర్స్ డే సందర్భంగా అందరి నాన్నలు తాము అనుకున్న పనుల్లో విజయం సాధించాలని కోరుకుంటున్నా.

- విజయేందిర బోయి, కలెక్టర్, మహబూబ్‌నగర్



నాన్నే నా జీవిత మార్గదర్శి..



నా జీవిత మార్గదర్శి నాన్నే. చదువుతో పాటు జీవితంపై నాకు ఎన్నో సందేశాత్మక సూచనలు చేశారు. పీయూసీ వరకు చదువుకున్న మా నాన్న రావుల నిరంజన్ ఆచారి సహకారశాఖలో రిజిస్ట్రార్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి రిటైర్డ్ అయ్యారు. చిన్ననాటి నుంచే సమాజంలో మంచి, సత్యం వైపు నిలబడేలా పెంచారు. ఉన్నత విద్యాబుద్ధులు చెప్పించిన నాన్న.. స్వశక్తితో ఎదగాలనే పట్టుదలను నిత్యం నింపేవారు. స్థిరపడిన వృత్తి ఏదైనా సమాజ హితం కోసం పనిచేయాలనే దృఢ సంకల్పాన్ని మాలో నింపే ప్రయత్నం చేశారు. భగవద్గీత, పౌరాణిక, ఆధ్యాత్మిక శ్లోకాలు, పాఠాలు చెప్పేవారు. యోగా, ధ్యానంతో ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలనే విషయం తెలియజేశారు. ఆయన ఇటీవల మాకు భౌతికంగా దూరమైనా.. నిత్యం మా మనసులోనే ఉంటారు. నాన్న జ్ఞాపకార్థం 'అహం బ్రహ్మోస్మీ' శీర్షికన పుస్తకాన్ని రాస్తున్నాను. త్వరలో ఆయనకు ఆ పుస్తకాన్ని అంకితం చేస్తాను.

- రావుల గిరిధర్, ఎస్పీ, వనపర్తి

నాన్నే తొలి గురువు



నా జీవితంలో మొదటి నుంచి అన్ని విషయాల్లో మా నాన్న హరిలాల్ తొలి గురువు. ఎప్పుడూ నా వెన్నంటే ఉండి నాకు ధైర్యం చెప్పే స్నేహితుడు కూడా నాన్నే. ఆయన సుదీర్ఘ అనుభవం, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన చూపించే సంయమనం, ధైర్యం నాకు ఆదర్శం. నాన్నలందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు.

తల్లిదండ్రులతో నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్ దంపతులు

తండ్రి బ్యాంకు ఉద్యోగి.. కొడుకు ఐఏఎస్


తల్లిదండ్రులతో యశ్వంత్, సుమంత్

వెల్దండ మండలం పోషమ్మ గడ్డతండాకు చెందిన వద్యావత్ ఉమాపతినాయక్ ఎస్‌బీఐలో ఉద్యోగిగా పని చేస్తూ తన ఇద్దరు కుమారులను ఉన్నతంగా చదివించారు. పెద్ద కుమారుడు యశ్వంత్‌నాయక్ ఇటీవల యూపీఎస్సీ ఫలితాల్లో 433 ర్యాంకుతో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. సివిల్స్ లక్ష్యంగా సన్నద్ధమైన యశ్వంత్ రెండో ప్రయత్నంలో 2024లో 627 ర్యాంక్ సాధించి ఐపీఎస్ సాధించారు. మహారాష్ట్ర ఐపీఎస్ కేడర్‌కు ఎంపికై హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతూనే మళ్లీ ఐఏఎస్‌కు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన ఫలితాల్లో మెరుగైన ర్యాంకుతో ఐఏఎస్ సాధించారు. తల్లిదండ్రులు పద్మ, ఉమాపతి నాయక్ కృషి, ప్రోత్సాహంతో విజయం సాధించానని యశ్వంత్ పేర్కొన్నారు.

గర్వంగా ఉంది..

నా పిల్లలను బాగా చదివించి ఉన్నతంగా ఎదిగేలా తీర్చిదిద్దాలనుకున్నాను. వారి చిన్నతనం నుంచే చదువుపై దృష్టి పెట్టి ప్రోత్సహించాం. పెద్ద కుమారుడు యశ్వంత్‌నాయక్ ఐఏఎస్ సాధించడం గర్వంగా ఉంది. చిన్న కుమారుడు కూడా సుమంత్‌నాయక్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. వారి చదువు కోసం పడిన శ్రమకు ఫలితం దక్కడంతో ఆనందంగా ఉన్నాను.

- యశ్వంత్ తండ్రి ఉమాపతి నాయక్

నాన్న బాటలో పయనిస్తా..



ప్రతి విషయంలోనూ చిన్నప్పటి నుంచి నాన్నే నాకు ఆదర్శం. రాజకీయాల్లో ఆయన సుదీర్ఘ అనుభవం నుంచి ఎంతో నేర్చుకున్నా. ఆత్మస్థైర్యం కోల్పోని వ్యక్తిత్వం, ఇన్నేళ్ల ప్రజా జీవితంలో ఉన్నా మచ్చలేని నాయకుడిగా కొనసాగిన రాజకీయ ప్రయాణం, ఎప్పటికీ ప్రజలతో మమేకమయ్యే ఆయన తీరు ఇవన్నీ నాకు స్ఫూర్తి. నా తండ్రిలా ఎప్పటికీ ప్రజల్లో ఉండేలా, నిస్వార్థంగా ప్రజల సంక్షేమ కోసం ఆయన బాటలో పయనిస్తా. అందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు.

తండ్రి కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

లోక్ అదాలత్‌లో 8,167 కేసులు పరిష్కారం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత

వనపర్తిటౌన్: కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీ మార్గంలో పరిష్కరించుకుని ఆనందంగా జీవనం గడపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత కోరారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు సముదాయం, ఆత్మకూర్ కోర్టుల్లో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని, రాజీ కుదుర్చుకోవడంతో ఇరువర్గాలు కక్షలు, కార్పణ్యాలు లేకుండా జీవనం సాగించవచ్చని వివరించారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ప్రీ లిటిగేషన్ కేసులు 5,600, సివిల్ కేసులు 15, క్రిమినల్ కేసులు 2,552, మొత్తం 8,167 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని, జిల్లా న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాల్వ నిర్మాణానికి సహకరించాలి


గ్రామస్తులు, అధికారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల: సింగోటం రిజర్వాయర్ నుంచి గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు నిర్మించనున్న లింక్ కెనాల్ నిర్మాణానికి రైతులు సహకరిస్తే త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జై బాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు సంగినేనిపల్లిలో పర్యటించి గ్రామ సమీపంలో లింక్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేశారు. కాల్వ నిర్మాణం పూర్తయితే చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లోని రైతుల సాగునీటి సమస్య తీరుతాయని.. భూ సేకరణకుగాను ప్రభుత్వ నిబంధనల ప్రచారం నిర్వాసితులకు పరిహారం ఇప్పిస్తానని, ఇందుకు సంబంధించిన కసరత్తు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఫోన్‌లో కోరారు. జాతిపిత బాపూజీ, రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. రాష్ట్రంలో రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణప్రసాద్, జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, కాంగ్రెస్‌పార్టీ ఉమ్మడి మండలాల అధ్యక్షులు బీరయ్యయాదవ్, శేఖర్‌యాదవ్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, యాదయ్య, గోపాల్‌నాయక్, రవీందర్‌రెడ్డి, కావలి మహేష్, గోపి, ధనుంజయ్య, చిన్నారెడ్డి, రాంరెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కేటీదొడ్డి: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కేటీదొడ్డి మండలంలోని మల్లాపురానికి చెందిన కంబయ్య (40) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతసేపటికి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంసభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా గ్రామంలోని ఓ ఇంటి సమీపంలో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు పంచానామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

వెల్దండ: మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు మండలం సింగంపల్లికి చెందిన జీవర్ధం వెల్దండలో ఉంటున్న కుమారుడి వద్దకు వచ్చాడు.ఈ క్రమంలో హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా కల్వకుర్తి నుంచి వెల్దండ వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడు ఫ్రాంక్లిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

నవోదయ పాఠశాలకు స్థల పరిశీలన



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలో నవోదయ పాఠశాల, బస్ టెర్మినల్, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాల, ఐఐటీ ఏర్పాటుకు స్థలాన్ని కలెక్టర్ విజయేందిర రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. శనివారం జిల్లాకేంద్రంలోని తిరుమల హిల్స్, బైపాస్ ప్రాంతాల్లో స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ నవీన్, బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ డీటీ దేవేందర్, ఆర్ఐ నర్సింగ్, సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ రాఘువేందర్, మునీర్ న్నారు.

నాన్నకు ప్రేమతో..

‘ఏ కష్టమెదురొచ్చినా.. కన్నీళ్లే ఎదురించినా.. ఆనందం అనే ఉయ్యాల్లో నన్ను పెంచిన నాన్నకు ప్రేమతో అంకితం నా ప్రతిక్షణం’ అంటూ సాగే సినీ గేయం పిల్లల పెంపకంలో తండ్రి పాత్రను చక్కగా వివరిస్తోంది. నవమాసాలు మోసి కనీ పెంచే తల్లితో పాటే.. సమాజంలో బతకడం నేర్పించే తండ్రి పాత్ర కీలకమే. అందుకే తండ్రులను గౌరవించడానికి ఒక ప్రత్యేకమైన రోజును ఏర్పాటు చేశారు. అదే ఫాదర్స్ డే.

– పాలమూరు/అమరచింత



బిడ్డల భవితకు తండ్రి చక్కని మార్గదర్శి

నేటితరం తండ్రుల్లో పెరిగిన స్నేహశీలత

ఆదర్శం.. షాలిమ్‌రాజ్ కూతుళ్లను ఉన్నతంగా చూడాలని..



ఇద్దరు కూతుళ్లతో షాలీమ్‌రాజ్ దంపతులు

తమలా తమ పిల్లలు ఉండకూడదని.. సమాజంలో ఉన్నతంగా రాణించాలని భావించిన ఆ తండ్రి తన కలలను నిజం చేసుకుంటున్నాడు. అమరచింతకు చెందిన సంగేపాగు షాలిమ్‌రాజ్, పుష్పలత దంపతులు మొదట్లో బీడీ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. 2006లో పుష్పలత ఆశ వర్కర్‌గా.. షాలిమ్‌రాజ్ ఫొటోగ్రాఫర్‌గా మారారు. వీరికి ఇద్దరు కూతుళ్ల సంతానం. దీంతో తమలా కూతుళ్ల కావొద్దనే ఉద్దేశంతో వారికి మంచి విద్యనందించాలని నిర్ణయించుకున్నారు. దీంతో పెద్ద కూతురు స్పందన ఇంటర్ పూర్తి కాగానే నీట్‌లో మంచి ర్యాంకు సాధించి బాచ్‌పల్లిలోని మమత మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ప్రస్తుతం ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తుంది. అలాగే చిన్న కూతురు సహన డిగ్రీ పూర్తి చేసి గ్రూప్ కోసం సిద్ధమవుతోంది. ఏదేమైనా కొడుకులకే ప్రాధాన్యత ఇస్తూ ఉన్నత చదువులు చదివించే తల్లిదండ్రులు ఉన్న సమాజంలో కూతుళ్లను సైతం ఉన్నత చదువులు చదివించి మంచి స్థాయిలో నిలబెడుతున్న షాలిమ్‌రాజ్ ఎందరో తండ్రులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి..



పిల్లలను మంచి పౌరులుగా తీర్చాలనే తపన ప్రతి తండ్రిలో కనిపిస్తోంది. ప్రస్తుతం పిల్లలు చదువురీత్యా తల్లిదండ్రులకు దూరంగా ఉండటం సాధారణమై పోయింది. తండ్రి తోడ్పాటుకు దూరమైన పిల్లల్లో భవిష్యత్ నిర్మాణం సక్రమంగా ఉండటం లేదు. ఇలాంటి వారిలో ఆత్మగౌరవం నశించడం, ప్రవర్తనలో మార్పు, చెడు వ్యసనాలకు బానిస కావడం వంటివి కనిపిస్తున్నాయి. అందువల్ల పిల్లలపై తండ్రి పర్యవేక్షణ అవసరం.

– డా.వంగీపురం శ్రీనాథాచారి, మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణుడు

పెరుగుతున్న ప్రాముఖ్యం..

పిల్లల పెంపకంలో తల్లితో పాటు తండ్రుల పాత్ర విడదీయలేనిదని ఇటీవలి కాలంలో గుర్తిస్తున్నారు. ప్రధానంగా పిల్లల ఎదుగుదలలో తండ్రి సంరక్షణ కీలకమైందని మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పలు అధ్యయనాల్లో సైతం ఇదే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. తండ్రి సంరక్షణలో పెరిగిన పిల్లల్లో మానసిక స్థైర్యం మెండుగా ఉంటుందని.. అభ్యసనా సామర్థ్యాలు మెరుగ్గా ఉంటాయని చెబుతారు.

చిన్నారులతో ఇలా మెలిగితే మరీ మంచిది..

నేటితరం పిల్లల్లో తల్లి కన్నా తండ్రితో ఆప్యాయత, అనుబంధం మరింతగా పెరుగుతోందని మనస్తత్వ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆడ పిల్లయినా, మగ పిల్లవాడైన నాన్నతో అతి గారాబంగా ఉంటున్నారు. దీంతో మరింత మారాం చేస్తున్నారు. కొందరు అతిగా గారాబం చేస్తుండగా.. మరికొందరు క్రమశిక్షణ పేరిట మందలింపు స్థాయి పెరుగుతోంది. ఈ క్రమంలో చిన్నారులతో ఇలా మెలిగితే మంచిదని అంటున్నారు నిపుణులు.

- తప్పుచేస్తే సరిద్దిదుకునే అవకాశం ఇస్తూ.. మంచి, చెడుకు మధ్య వ్యత్యాసాన్ని వివరించాలి.
- చిన్నచిన్న కారణాలకే పెద్ద శిక్షలు విధిస్తే చిన్నారుల మనసులో ముద్రపడి పోతుంది. సౌమ్యంగా మాట్లాడుతూ మార్పు తెచ్చే ప్రయత్నం చేయాలి.
- పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని.. చెప్పిన మాట వినడం లేదని తరచూ కోప్పడితే ఆత్మస్థైర్యాన్ని కోల్పోతారు.
- ఒత్తిడి కలిగించే విషయాలను దూరంగా ఉంచాలి.
- చీటికి మాటికి తిడితే చులకన భావం ఏర్పడుతుంది. మందలింపుతో న్యూనతాభావం కలుగుతుంది.
- ప్రతి చిన్న విషయాన్ని క్రమశిక్షణగా ఉండాలనే నిబంధనలను పిల్లలపై పెట్టొద్దు.
- వయసుల వారీగా పిల్లల ప్రవర్తనను పర్యవేక్షించాలి. అవసరం మేరకు చనువు ఇవ్వాలి.
- సరిదిద్దుకోలేని తప్పులు చేస్తే ఎదురయ్యే పరిణామాలను వివరించాలి.
- పిల్లలు ఎల్లప్పుడూ తండ్రిని అనుసరిస్తుంటారు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సమాజంలో మెలగాలి.
- అన్నింటికీ కన్నా అండగా ఉంటారనే నమ్మకాన్ని కలిగించాలి.
- బాల్యం నుంచే వారి ఆలనాపాలనా చూస్తూ ఆదర్శంగా నిలవాలి.
- విద్యార్థి దశలో వారికి వచ్చే సందేహాలను నివృత్తి చేయాలి.
- ఉన్నత ఆశయాలు, ఉత్తమ భావాలు అలవడేలా తీర్చిదిద్దాలి.

యల్లందొడ్డిలో ఏరువాక సందడి





కుంభం కాగులతో ఆంజనేయస్వామి ఆలయం వద్ద గ్రామస్తులు, ఉత్సవానికి సిద్ధమైన రథం

- కుంభం కాగుతో నైవేద్యాల సమర్పణ
- కొనసాగుతున్న శనివారం ఆనవాయితీ

గట్టు: ఏరువాక పండుగను శనివారం యల్లందొడ్డి గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. ముంగారి సేద్యం ప్రారంభంలో రైతులు ముందుగా జరుపుకునే పండుగ ఏరువాక పండుగ. అయితే యల్లందొడ్డి గ్రామస్తులు మాత్రం ఏరువాక పండుగ వారంలో ఏరోజు వచ్చినా వారు మాత్రం పండుగను పౌర్ణమి తర్వాత వచ్చే మొదటి శనివారం జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. గ్రామస్తులు ఎక్కువగా ఆంజనేయస్వామిని కొలుస్తుండటంతో శనివారం నాడు ఏరువాకను పండుగను జరుపుకుంటున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

కుంభం కాగుతో నైవేద్యం..

ఏరువాక పండుగను పురస్కరించుకొని గ్రామంలోని ప్రతి కుటుంబం ఉపవాసంతో ఇష్టదైవం ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో కుంభం కాగుతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా పూలు, మామిడి ఆకుల తోరణాలతో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం కాడెద్దుల ఊరేగింపు, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. గ్రామ చావిడికి తోరణాన్ని ఏర్పాటు చేసి, ఆ తోరణాన్ని ఎద్దులు పరుగెత్తుకుంటూ వచ్చి తెంపే పోటీలు ఏర్పాటు చేశారు. అనంతం రాత్రి రథోత్సవం కనులపండువగా సాగింది.

ప్రతి కుటుంబంలో స్వామి పేరు

గ్రామస్తుల్లో ఎక్కువ మంది ఆంజనేయస్వామిని ఆరాధిస్తుండటంతో ప్రతి కుటుంబంలో ఒకరికి ఆంజనేయులు, హనుమంతు, తిమ్మప్ప, అంజి అనే పేర్లు పెట్టుకుంటారు. ఆంజనేయులు అని ఒకరిని పిలిస్తే ఒకేసారి ఐదారుమంది పలుకుతుంటారు.

ముగిసిన టీజీపీఈసెట్ ఈవెంట్స్



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా బీపెడ్, డీపెడ్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈవెంట్స్ శనివారం ముగిశాయి. చివరిరోజు బీపెడ్‌లో 412 మందికి 311 మంది, డీపెడ్‌లో 154 మందికి గాను 86 మంది విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన ఈవెంట్స్‌లో మొత్తం 2,608 మందికి గాను 1,752 మంది హాజరవగా.. 856 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని సెట్ కన్వీనర్ దిలీప్ తెలిపారు. ఈవెంట్స్‌లో పాల్గొన్న విద్యార్థుల మార్కుల రూపంలో పొందుపర్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ మరో రెండు, మూడురోజుల్లో పూర్తి కానుండగా.. వారం రోజుల్లో ఫలితాలు విడుదల కానున్నట్లు సమాచారం.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: చేపలవేటకు వెళ్లి నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దేవినేనిపల్లి గ్రామానికి చెందిన మీనుగు లక్ష్మయ్య(52) శనివారం గ్రామ సమీపంలోని కుప్పలబావికుంటలోకి చేపల వేటకు వెళ్లాడు. వల వేసి నీటిలో మునిగి ఊపిరాడక చనిపోయాడు. కుటుంబ సభ్యులు కుంట దగ్గరకు వెళ్లి చూడగా దుస్తులు, చెప్పులు కనిపించాయి. నీటిలో మునిగిపోయినట్లు గుర్తించి చెరువులో గాలించి మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ విషయంపై లక్ష్మయ్య కుమారుడు అశోక్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, భార్య అలివేల ఉన్నారు.



మీనుగ లక్ష్మయ్య (ఫైల్)

కొత్తపల్లిలో యువకుడు..

కోస్గి రూరల్: చేపల వేటకు వెళ్లి బురదలో కూరుకుపోయి ఓ యువకుడు మృతి చెందిన ఘటన శనివారం మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా శాలపూరం మండలం కురుమల్లపూడి గ్రామానికి చెందిన ద్యావర్ల రాజశేఖర్ (28) మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలోని చెరువు దగ్గర అలుగు మరమ్మతు పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. గురువారం రాత్రి గ్రామంలోని చెరువులో చేపలు పట్టడానికి రాంచందర్‌తో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో రాంచందర్ కాలికి వల చుట్టుకొని బురదలో కురుకుపోయాడు. చుట్టు ప్రక్కల వారిని పిలిపించి చూడగా అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

‘రిషి’ విద్యార్థుల విజయఢంకా



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న రిషి కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు నీట్ ఫలితాల్లో విజయఢంకా మోగించారు. విద్యార్థులు తరుణ్‌సాయి 550, స్వర్ణకుమారి 545, వినయ్ 525 మార్కులతో జాతీయ స్థాయిలో సత్తా చాటారు. కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో మెడికల్ సీట్లు సాధించనున్నారని కళాశాల కరస్పాండెంట్ చంద్రకళావెంకట్ తెలిపారు. జిల్లా విద్యార్థులు ర్యాంకుల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వలస వెళ్తున్న క్రమంలో స్థానికంగానే మెరుగైన విద్య అందించేందుకు రిషి విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. విద్యార్థులకు ఇంటర్మీయట్ విద్యతో పాటు పోటీ పరీక్షల్లో పాల్గొనే విధంగా సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంతటి విజయానికి సహకరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి, అకాడమిక్ డీన్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్నకుమారి, రాఘవేందర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయకేతనం ఎగురవేసిన ‘ప్రతిభ’



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ప్రతిభ కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రతిభ మెడికల్ అకాడమీ విద్యార్థులు నీట్ ఫలితాల్లో జాతీయస్థాయి ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. విద్యార్థులు మంజు 593, ఎండీ డానిష్ 544, మధుకుమార్ 527, హర్షఫాతిమా 517, మారెమ్మ 501, భీమేశ్వరి 480, సుప్రజ 477, ముజాహీద్ 473, భావన 469, జశ్వంత్ 462, తన్మయ్ 461, ఐశ్వర్య 452, అరుణ్ 447, మహరాజ్ 446, ప్రణవ్‌సాయి 441, నౌషీన్ సుల్తానా 441, కె.గణేశ్ 437, అంజుమ్ 435, శ్రీచందన 432, సిద్దికా నౌనీన్ 431, షాగుప్త 426, సాగుప్తనాజ్ 426, రాహుల్ 426, స్ఫూర్తిరెడ్డి 422, కృతి 420, ప్రణీత 418 మార్కులతో ప్రతిభ చాటారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రతిభ కళాశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ సలహాదారు మంజులాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో సత్తా చాటిన ‘వాగ్దేవి’



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నీట్–2025 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారన్నారు. వన్ క్లాస్ ప్రత్యేక ప్రోగ్రాంతో ఇన్నోవేటివ్ సైంటిఫిక్ అప్రోచ్‌తో మెరుగైన విద్య అందిస్తున్నట్లు వివరించారు. సాధారణ విద్యార్థులు సైతం జాతీయస్థాయి ర్యాంకులు సాధించే విధంగా తీర్చిదిద్దామని.. 85 మంది విద్యార్థుల్లో 38 మందికి పైగా మెడికల్ సీట్లు సాధిచారన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఐబీటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతినందన్‌రెడ్డి, యాకూబ్, షాకీర్, కోట్ల శివకుమార్, సతీష్‌రెడ్డి, నాగేందర్, రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద



జూరాల జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం

ధరూరు/ఆత్మకూర్: కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల జలాశయానికి వరద కొనసాగుతుందని పీజేపీ ఈఈ జుబేర్ అహ్మద్ తెలిపారు. ఎగువన రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద ప్రారంభమైందని, అలాగే ప్రాజెక్టు ఎగువన కురిసిన వర్షానికి ఆది, సోమవారం జూరాలకు వరద పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు వివరించారు. ప్రాజెక్టు దిగువన ఉన్న విద్యుత్ కేంద్రాలకు నీటిని విడుదల చేసి ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం 14 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం సాయంత్రానికి 15 వేల క్యూసెక్కులకు పెరిగిందని.. విద్యుదుత్పత్తి నిమిత్తం 35,122 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 1,500, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు వినియోగిస్తుండగా.. 69 క్యూసెక్కుల నీరు ఆవిరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.462 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వివరించారు.

9 యూనిట్లలో విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లోని 9 యూనిట్ల నుంచి శనివారం ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువన 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 19.474 మి.యూ., దిగువన 4 యూనిట్ల నుంచి 160 మెగావాట్లు, 20.265 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 39.739 మి.యూ. విద్యుదుత్పత్తి జరిగిందని.. జలాశయానికి పూర్తిస్థాయిలో వరద చేరితే 11 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపడతామని వివరించారు.